క్లుప్తంగా

సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయంలో పూజలు



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు బారుల తీరారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో నిల్చున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక శ్రీ సత్యానారాయణ స్వామి వత్రాలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

స్కావెంజర్లను నియమించండి

బడంగ్‌పేట్: బాలాపూర్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను, స్వీపర్లను ప్రభుత్వం వెంటనే నియమించాలని బడంగ్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాలాపూర్ మండలంలో జెడ్పీ పాఠశాలలతో పాటు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. బాత్‌రూంలు శుభ్రంచేయడానికి స్కావేంజర్లు, ఇతర పనులకోసం అటెండర్లను నియమించాలన్నారు. ఏ పాఠశాలల్లో కూడా కిందిస్థాయి సిబ్బంది లేక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సిబ్బందిని నియమించాలని కోరారు.

కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి

సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్



కందుకూరు పీహెచ్‌సీలో వైద్యాధికారిణికి వినతి పత్రం ఇస్తున్న ఆశ వర్కర్లు, బాల్‌రాజ్

కందుకూరు: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 13న చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారిణి డాక్టర్ రాధికకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు నిర్వహించనున్న పరీక్షను రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అధికారంలోకి రాకముందు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



క్రిస్టియన్ కాలనీలో అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: అభివృద్ధి పనుల విషయంలో అధికారులు నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని క్రిస్టియన్ కాలనీలో నిర్మాణం పూర్తి చేసుకున్న రెయిన్ వాటర్ పైప్ లైన్ పనులు, కొత్తగా నిర్మించబోయే రోడ్డు పనులను అధికారులతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో చిన్నపాటి వర్షానికే ఎగువ కాలనీల నుంచి వచ్చే వరద నీటికి క్రిస్టియన్ కాలనీ వరద ముంపుకు గురై కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని అన్నారు. ఇప్పుడు నూతనంగా వర్షపునీరు పోవడానికి పైప్‌లైన్స్ వేయడం జరిగిందని అన్నారు. అలాగే నూతనంగా రోడ్డు మంజూరు అయిందని అన్నారు. రోడ్డు విషయంలో అధికారులు ఎత్తు పల్లాలు సరిచూసుకుని రోడ్డును వేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు రఫీ, ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడలో చెరువు కట్టపై ఏర్పడ్డ పగుళ్లు



కట్టపై పెరిగిన పిచ్చి మొక్కలు

సున్నం చెరువు కట్టకు పగుళ్లు!

వర్షాకాలం ప్రారంభంలోనే సమస్య

- మరమ్మతులు చేపట్టాలని వేడుకొంటున్న రైతులు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- ఇబ్బందుల్లో స్థానికులు, కర్షకులు



సున్నం చెరువు

కందుకూరు: వర్షాకాలం ప్రారంభమైంది. వర్షాలు కురుస్తున్నాయి. రానున్న కాలంలో భారీ వర్షాలు కురిసే అవకాశం లేకపోలేదు. చెరువులు, కుంటల్లోకి నీరు చేరి భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. అవకాశం ఉన్నచోట బోరు మోటార్లతో కూడా పంటలు సాగు చేయొచ్చని రైతన్నలు ఆశగా నిరీక్షిస్తున్నారు. భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండితే, అందుకు తగ్గట్లుగా ముందస్తుగా చెరువు కట్టలను పటిష్ఠం చేయాల్సి ఉంది. వర్షాలతో చెరువు నిండితే కట్టలు తెగకుండా గట్టిగా ఉన్నాయా? లేవా? చూసుకోవాలి. చెరువుకట్ట తెగితే నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలి. మరోవైపు లోతట్టు ప్రాంతాలు జలమయంకాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉంది. మండలంలో సంబంధిత అధికారులు మాత్రం కట్టల బలోపేతానికి సరైన చర్యలు తీసుకున్నట్లు కనిపించడం లేదు.

పెద్ద చెరువులతో తప్పని ఇబ్బందులు..

మండల పరిధిలో తిమ్మాపూర్‌లోని తిమ్మని చెరువు, ఆకులమైలారం మైలమ్మ చెరువు, రాచులూరు సంధ్యమ్మ చెరువు, కొత్తగూడలోని సున్నం చెరువు, జైత్వారంలోని నాయని చెరువు, సాయిరెడ్డిగూడలోని పెద్దిరెడ్డి చెరువు, ముచ్చర్లలోని పాకమోని చెరువు, నేదునూరులోని నల్ల చెరువుతో పాటు గుమ్మడవెల్లిలోని తుల్జాభాయి కత్వా, మీర్‌ఖాన్‌పేటలోని రామ్‌భాయి కత్వాల పరిధిలో దాదాపుగా 100నుంచి 430 ఎకరాల ఆయకట్టు సాగు ఉంది. వీటితో పాటు పలు గ్రామాల్లో పెద్ద, చిన్న కుంటలు అన్నీ కలిసి 165 వరకు ఉన్నాయి. ఆయా చెరువులు, కుంట కట్టలను వేసవిలోనే బలోపేతం చేయాలి. కాని ఎక్కడా కూడా అలా చేసినట్లు దాఖాలాలు లేవు.

నిర్లక్ష్యం చేస్తే అంతే సంగతులు..

కొత్తగూడ సున్నం చెరువు కట్టకు అక్కడక్కడా పగుళ్లు కనిపిస్తున్నాయి. మరోపక్క ఆ కట్టపై పిచ్చి మొక్కలు మొలిసి అడవిని తలపిస్తుంది. గతంలో నిర్లక్ష్యం చేయడంతో మహ్మద్‌నగర్ పరిధిలోని పోరుడోని కుంట కట్ట రెండు పర్యాయాలు తెగి నీరంతా వృథాగా పోయింది. చిప్పలపల్లిలోని చెరువుకు గండి పడి నీరంతా లోతట్టు ప్రాంతాలకు చేరింది. కనీసం వర్షాకాలం ప్రారంభంలోనైనా ఇరిగేషన్ అధికారులు అన్నీ చెరువులు, కుంటల కట్టలను పరిశీలించి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

> **కట్టలను పటిష్ఠం చేయిస్తాం**
>
> 2014–15 నుంచి మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువు కట్టలను బలోపేతం చేయించాం. ప్రస్తుతం ఎక్కడైనా బలహీనంగా అనిపిస్తే గుర్తించి మరమ్మతు పనులు మొదలుపెడతాం. 21 చోట్ల పనులు చేపట్టడానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే చెరువు కట్టలను పటిష్ఠం చేయించడానికి పనులు చేపడుతాం.
>
> – ఎండీ హబీబుద్దీన్, ఏఈ ఇరిగేషన్, కందుకూరు

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- మాజీ మంత్రి సబితారెడ్డి
- మున్సిపల్ పనులపై సమీక్ష సమావేశం



సమావేశంలో మాజీ మంత్రి సబితారెడ్డి, అధికారులు

తుక్కుగూడ: అభివృద్ధి పనుల పట్ల అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని, వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన నివాసంలో మంగళవారం తుక్కుగూడ మున్సిపాలిటీ అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై మున్సిపల్ అధికారులు, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, నాయకులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులు ఎన్ని పూర్తయ్యాయి, పూర్తి కానివి ఎన్ని? మధ్యలో నిలిచిపోయిన వాటిని తక్షణమే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకరావాలన్నారు. ముఖ్యంగా ప్రజలకు మౌలిక వసతులైన రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ తదితర అంశాల్లో ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి, ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ముంపు ప్రాంతాలను గుర్తించి, తగ్గిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, డీఈఈ ఏ.యాదయ్య, ఏఈ కె.భార్గవ్‌రెడ్డి, కౌన్సిలర్లు రవినాయక్, సప్పిడి లావణ్య, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త కురుమ సత్తయ్యకు సన్మానం

కందుకూరు: తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంక్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అధ్యక్షుడు కొత్త కురుమ సత్తయ్యను మంగళవారం కందుకూరు పీఏసీసీ చైర్మన్ హెచ్‌డీసీసీబీ కార్యవర్గ సభ్యులు డి చంద్రశేఖర్, లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీసీసీబీ బ్యాంకు డైరెక్టర్లు బి సతీశ్, పి అంజిరెడ్డి, ఎస్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎం బాల్‌రెడ్డి, ఎస్ రవీందర్‌గౌడ్, పి రాంరెడ్డి, కె శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.



నూతన ఉపాధ్యక్షుడిని సన్మానిస్తున్న సభ్యులు

మధురానగర్ అసోసియేషన్ ఎన్నిక



మధురానగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులను అభినందిస్తున్న బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి

అభినందించిన బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 26వ డివిజన్‌లోని మధురానగర్ కాలనీ ప్లాట్స్ అండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఏమిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా ముచ్చర్ల తిరుపతయ్యయాదవ్, కోశాధికారి శిరందాసు వెంకటేశ్, ఉపాధ్యక్షుడు ఏ సత్తయ్య, వి రామారావు, జి పురుషోత్తంరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా కె వెంకట్‌రెడ్డి, డి మధుసూదన్‌రెడ్డి, డి రాజేందర్‌రావు, ముఖ్య సలహాదారులు గార్లపాటి మల్లారెడ్డి, కార్యవర్గసభ్యుడిగా ఎండీ జహంగీర్, సీఎచ్ మధుచారి, సాగి రాహుల్ శర్మ, పి శ్రీశైలం యాదవ్, వేముల లక్ష్మీకాంత్‌రావు, పాశం విజేందర్‌రెడ్డి, బి రాజశేఖర్‌రెడ్డి, ఎస్ నర్సింహారెడ్డి, జి చంద్రశేఖర్‌రెడ్డి, కంచర్ల సుధీర్‌రెడ్డి, సురభి ప్రకాశ్‌రావు, కుంభం దినేశ్‌రెడ్డి, మునుకుంట్ల సైదులుగౌడ్, మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు. మంగళవారం స్థానిక కార్పొరేటర్ రామిడి కవిత, బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి నూతనంగా ఎన్నికైనా అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డితో పాటు ప్యానల్‌లో విజయం సాధించిన అసోసియేషన్ కమిటీని శాలువ కప్పి సన్మానించి ఘనంగా అభినందించారు. మధురానగర్ కాలనీ సంక్షేమానికి నూతనంగా ఎన్నికైన కమిటీ పూర్తి సహకారం అందించాలని కోరారు. నియామకానికి సహకరించిన మధురానగర్ కాలనీవాసులకు రాజేశ్వర్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి

పహాడీషరీఫ్: బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలని మహేశ్వరం డివిజన్ ఏసీపీ పి లక్ష్మీకాంత రెడ్డి పేర్కొన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకొని షాహీన్‌నగర్‌లో మంగళవారం సాయంత్రం మైత్రీ కమిటీ, మున్సిపాలిటీ అధికారులు, స్థానిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఖుర్బానీ ఎద్దులు, గొర్రె పొట్టేళ్లను విక్రయించే వ్యాపారులు రోడ్లపై కాకుండా పక్కకు విక్రయించుకోవాలన్నారు. ముఖ్యంగా జంతు ప్రొటెక్షన్ యాక్ట్‌కు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. బక్రీద్ పండుగ అనంతరం వ్యర్థాలను రోడ్లపై కాకుండా మున్సిపాలిటీ తరఫున అందించిన కవర్లలో వేసి సిబ్బందికి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ భూపతి, జల్‌పల్లి మున్సిపాలిటీ రెవెన్యూ అధికారి యెన్నం సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

మండల విద్యాశాఖ అధికారి కృష్ణ

మహేశ్వరం: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాధికారి కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 31 గ్రామ పంచాయతీలు, తుక్కుగూడ మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాలలో 5 సంవత్సరాలలోపు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవంతో కూడిన ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన చేస్తారన్నారు. విశాలమైన తగరతి గదులు, క్రీడా మైదానం, పచ్చని వాతావరణం, ప్రతి విద్యార్థికి ఉచితంగా రెండు జతల యూనిఫాం పంపిణీ, గుడ్డుతో కూడిన మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు ఉచితంగా ఆరోగ్య, కంటి పరీక్షలు, నట్టల నివారణ మందుల పంపిణీ, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి బలోపేతం చేయాలని కోరారు.

సమస్యల స్వాగతం!

- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- వనస్థలిపురం హైస్కూల్లో పూర్తికాని తరగతి గదుల నిర్మాణం
- ఒకవైపు నిర్మాణ పనులు మరోవైపు కొనసాగనున్న విద్యాబోధన
- విద్యార్థులకు తప్పని అవస్థలు



నిర్మాణంలో వనస్థలిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల భవనం

వనస్థలిపురం: నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి.. వేసవి సెలవుల అనంతరం ఉత్సాహంగా స్కూళ్లకు వస్తున్న విద్యార్థులకు పలు ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న తరగతి గదులు, మూత్రశాలలు వంటి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. వనస్థలిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 840 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న తరగతి గదులు సరిపడ లేకపోవడంతో గతేడాది సర్వశిక్షాభియాన్ నిధులు రూ.70 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. అయితే పనుల్లో జాప్యం వల్ల పాఠశాల పునః ప్రారంభమయ్యే సమయం వచ్చినా గదుల నిర్మాణం మాత్రం ఇంకా పూర్తికాలేదు. ఒక వైపు తరగతులు ప్రారంభమవుతుండటం, మరోవైపు నిర్మాణం పనులు జరుగుతుండటంతో విద్యార్థుల చదువుకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దుర్గాలతను వివరణ కోరగా ఆగస్టు నాటికి అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. అప్పటి వరకు విద్యార్థులకు ఇబ్బందులు తప్పని పరిస్థితులు నెలకొని ఉన్నాయి.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తాం



సమావేశంలో మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్



పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న మేయర్ పారిజాత, కమిషనర్ రఘు

- మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్
- ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం

బడంగ్‌పేట్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్షమని బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులతో వారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆదర్శ కమిటీలు, పాఠశాలల్లో ఉన్న సమస్యలను ప్రధానోపాధ్యాయులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా మరమ్మత్తు పనులు చేపట్టాలన్నారు. బోరు మోటర్లు, ఎలక్ట్రికల్ సామన్ల రిపేర్లు, ఫ్యాన్లు వంటివి ఏమైన ఉంటే వెంటనే బాగు చేయించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. పాఠశాలల తరగతి గదులను శుభ్రం చేయాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏంఈవో కృష్ణయ్య, డీఈఈ జ్యోతి, ఏఈ వినీల్, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రీఓపెన్ రోజు గుర్తొచ్చాయా?

బుధవారం నుంచి తెలంగాణ ప్రభుత్వం అన్ని స్కూళ్లను రీ ఓపెన్ చేయడానికి షెడ్యూల్ ఖరారు చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా బాలాపూర్ మండలంలోని ప్రభుత్వ బడులు ప్రారంభించే రోజున బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పాలకులకు, అధికారులకు గుర్తుకొచ్చాయా? అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం పది రోజులనుంచి నిర్వహిస్తున్నారు. బడీడు పిల్లల్ని బడిలో చేర్పించే పనిలో పడ్డారు. అలాగే ప్రైవేట్ స్కూళ్ల కంటే గవర్నమెంట్ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని ప్రచారం నిర్వహిస్తున్నారు. కానీ బాలాపూర్ మండలంలో ఏ ప్రభుత్వ పాఠశాలనుంచి బడిబాట కార్యక్రమం నిర్వహించడం లేదని సమాచారం. బడంగ్‌పేట కార్పొరేషన్ పాలకులకు, అధికారులకు పాఠశాలలు పున: ప్రారంభం రోజు బడులు గుర్తుకు రావడం శుభ పరిణామమని చెబుతున్నారు. మరోవైపు వారు రివ్యూలు నిర్వహించి బడుల బలోపేతం కోసం తీసుకునే చర్యల్ని అభినందిస్తున్నారు. పాతబడ్డ బడులను పర్యవేక్షించి మరమ్మతు పనులు చేయించాలని ఆలోచన రావడం, ఆ దిశగా అడుగుటు వేయడం నిజంగా సంతోషించదగ్గ విషయమేనని పలువుతు చర్చించుకుంటున్నారు.

మరమ్మతు పనుల పరిశీలన

కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లో మేయర్ పారిజాత, కమిషనర్ రఘు సిబ్బందితో కలిసి మంగళవారం పర్యటించారు. నాదర్‌గుల్ కమ్మగూడలోని ఓపెన్ నాలాను పరిశీలించారు. రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని నాలాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అల్మాస్‌గూడలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, డీఈఈ జ్యోతి, కార్పొరేటర్ పద్మ ఐలయ్య శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి సిబ్బంది పాల్గొన్నారు.